ఎమ్మెల్సీ దండె విఠల్ జన్మదిన వేడుకలు

బెజ్జూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి మిఠాయిలు పంచారు. మండల కేంద్రంలోని రంగనాయక ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, సామల రాజన్న, ఎల్కరి రమేష్, రంగు సురేష్‌గౌడ్, గుమ్ముల శ్రీనివాస్, మిర్యాల పెంటయ్య తదితరులున్నారు.

కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలి

కాగజ్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఆర్మీ సైనికులకు కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని జిల్లా రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. ఆదివారం ఈసుగాం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకు కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇంతవరకు సమస్యను పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కమ్యూనిటీ భవనానికి నిధులు కేటాయించాలని పేర్కొన్నారు.

నేడు పూలాజీబాబా ధ్యాన కేంద్రం ప్రారంభం

వాంకిడి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిగూడ గ్రామంలో 17వధ్యానకేంద్ర వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పూలాజీబాబా నూతన ధ్యానకేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు కమిటీ సభ్యులు గుర్నులే మెంగాజీ, వెంకట్‌రావు తెలిపారు. కార్యక్రమానికి పూలాజీ బాబా తనయుడు కేశవరావు ఇంగ్లే, వామన్‌రావు ఇంగ్లేహాజరవుతున్నారని అన్నారు. మండలంలోని పూలాజీబాబా భక్తులు అధికసంఖ్యలో హాజరైకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



గెలలు చేతికొచ్చాయి..

ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి 25నుంచి 30ఏళ్ల వరకు పంట తీసుకోవచ్చు. ఎకరానికి 12టన్నుల దిగుబడి వస్తుంది. టన్నుకు రూ.20వేలు వచ్చినా పెట్టుబడులు పోను ఎకరానికి రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. అంతేకాకుండా నాలుగేళ్లపాటు అంతరపంటగా వివిధ రకాల పంటలను సాగు చేసుకోవచ్చు.

మంచి ఆదాయం..

సాగు చేసిన పంటను కంపెనీల వారే రైతుల దగ్గరకు వచ్చి కొనుగోలు చేస్తారని ఈ విషయంలో ఆందోళన చెందవద్దని ఉద్యానవనశాఖ అధికారులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో ధర మరింత పెరిగే అవకాశం ఉంటుందని తెలుపుతున్నారు. మరో ఏడాది తర్వాత ప్రతి రెండు మండలాల పరిధిలో ఆయిల్‌పామ్ గెలల సేకరణ కేంద్రాలు ఏర్పాటుకు అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల పరిధిలో మహిక్స్ కంపెనీ వారు భీమిని, తాండూరు, రెబ్బెన ప్రాంతాల్లో ఏదో ఓచోట ఫ్యాక్టరీ ఏర్పాటుకు సుముఖంగా ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

- సంతోషంలో ఆయిల్ పామ్ రైతులు
- ఎవరికి విక్రయించాలోనన్న సందిగ్ధం
- కొనుగోలుపై దిగులు వద్దంటున్న అధికారులు
- ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలే కొంటాయని భరోసా

బెజ్జూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడేళ్ల క్రితం నాటిన ఆయిల్ పామ్ మొక్కలు గెలలు వేసి నేడు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాయి. రైతులు మార్కెటింగ్ కోసం ఎలాంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని ఉద్యానవన అధికారులు పేర్కొంటున్నారు. ఒప్పందం చేసుకున్న కంపెనీలో రైతుల వద్దకు వచ్చి పంటను కొనుగోలు చేస్తాయని అంటున్నారు. పంట చేతికొస్తుండ డంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 2021-22లో ఆయిల్‌పామ్ సాగును రైతులు ప్రారంభించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1450ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగు అవుతోంది. జనవరి తర్వాత మరో 250ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

మూడు నెలల్లో దిగుబడి వచ్చే అవకాశం..

ప్రస్తుతం ఆయిల్ పామ్ గెల టన్ను ధర రూ.20,500ఉండటంతో సాగు చేస్తున్న రైతులు ఆనందంగా ఉన్నారు. మూడేళ్ల క్రితం నాటిన మొక్కలు మరో మూడునెలల్లో దిగుబడులను ఇవ్వనున్నాయని ఉద్యానవనాధికారులు పేర్కొంటున్నారు.

ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం..

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. రైతులు సాగు చేయడానికి మొక్కలు, రాయితీ, ప్రోత్సాహకాలు ఇస్తోంది. గుంతలు తవ్వడానికి, ఇతరత్రా పనులకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తోంది. రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయడానికి ఒక్కో ఎకరాకు 50మొక్కలకు పైగా అవసరం ఉంటుంది. ఒక్కో మొక్కకు మార్కెట్‌లో రూ. 193 ఉండగా, ప్రభుత్వం రూ.173రాయితీ కల్పిస్తోంది. దీంతో రైతులు ఒక్కో మొక్కకు రూ.20 చెల్లించాల్సి ఉంటుంది. బిందు సేద్యం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు 100శాతం రాయితీ, చిన్నసన్నకారు రైతులకు 90శాతం, ఇతరులకు 80 శాతం రాయితీని ప్రభుత్వం ఇస్తోంది.

సాగులో భాగంగా ఒకమొక్క నాటడం కోసం రెండడుగుల లోతు, వెడల్పుగా గుంతలు తవ్వాల్సి ఉంటుంది. గుంతలు తవ్వడానికి రూ.100వరకు ఖర్చు అవుతుంది. 50గుంతలకు సుమారు 5000వరకు ఖర్చు వుతుంది. అదేవిధంగా మొక్కల సంరక్షణకు ఎకరాకు రూ.2100, అంతరపంట సాగు కోసం ఎకరాకు రూ.2100 ఇస్తూ ఏడాదికిగాను రూ.4200 చెల్లిస్తుంది. ఇలా నాలుగేళ్ల వరకు రైతులకు ప్రభుత్వం చెల్లించ నుంది. బిందు సేద్యం పరికరాలు అమర్చడం, ఎరువులు, మందులు, మొక్కల సంరక్షణ, నర్సరీల నుంచి మొక్కలకు అయ్యే ఖర్చులు, కలుపు తీయడం, ఇలా అన్నింటిలోనూ ప్రభుత్వం సహకారం అందిస్తుంది.



కాగజ్‌నగర్‌లో సాగు చేసిన ఆయిల్‌పాం

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు..: అబ్దుల్ నదీమ్, జిల్లా ఉద్యానవన అధికారి, ఆసిఫాబాద్



రైతులు ఆయిల్‌పామ్ సాగుచేయడం ద్వారా అధికలాభాలు పొందవచ్చు. ఆయిల్ పామ్ సాగుకు పెట్టుబడి తక్కువగా ఉంటుంది. కలుపు, ఇతర పనులు ఎక్కువగా ఉండదు. పంటనష్టం, కోతుల బెడద ఉండదు. ఆయిల్‌పామ్ సాగును ఒక్కసారి సాగుచేస్తే 30ఏళ్లవరకు ఆదాయం సమకూరుతూనే ఉంటుంది. పంట సాగుకు నిరంతర విద్యుత్, నీటివసతి ఉంటే చాలు. జిల్లాలో ఇప్పటికే వ్యవసాయ చేలల్లో 4961బోర్లు ఉన్నాయి. ఆసక్తిగల రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసిన ట్లయితే ప్రభుత్వం రాయితీ కూడా ఇస్తుంది. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుంది.

ఒంటి కాలిపై నిల్చుని ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



ఒంటికాలిపై నిల్చుని నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఆసిఫాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమను పర్మినెంటు చేయాలంటూ ఆదివారం ఆసిఫాబాద్ సమ్మె శిబిరంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఒంటి కాలిపై నిల్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు శృతికా మాట్లాడుతూ ఈనెల 10నుంచి సమ్మె చేపడుతున్నా ఇంతవరకు ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. తమను వెంటనే పర్మినెంటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి తుకారాం, సంఘం జిల్లా కోశాధికారి నగేష్, గేడెకార్, సంతోష్, దుర్గం సందీప్, అన్నపూర్ణ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల28, 29, 30తేదీల్లో నల్గొండలో నిర్వహించే రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్లను ఆదివారం ఆసిఫాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైజ్ఞానిక మహాసభల జిల్లాకార్యదర్శి షిండేహేమంత్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, జీవో 317 సమస్య పరిష్కారానికి, పీఆర్సీ సమస్యలను పరిష్కరించేందుకు మహాసభలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు అంతా హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కోశాధికారి రమేష్, జిల్లా నాయకులు నవీన్‌కుమార్, రవికుమార్, జాదవ్, సుభాష్, సంతోష్, సమ్మయ్య, నాయకులు చొక్కారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో గణిత శాస్త్ర దినోత్సవం

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్‌లో ఆదివారం గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా ప్రధానకార్యదర్శి తుకారాం, సంఘం జిల్లా కోశాధికారి నగేష్ మాట్లాడుతూ గణితశాస్త్ర దినోత్సవ వేడుకలు భారత ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త రామానుజన్ పుట్టిన రోజును పురస్కరించుకొని ఏటా జరుపుతుండటం గొప్ప విషయమన్నారు. దైనందిన జీవితంలో గణితం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో ఆయాశాఖల సభ్యులు, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.



రామనుజన్ చిత్రపటంతో సభ్యులు

కబడ్డీ జట్టుకు టీ షర్టులు పంపిణీ



టీ షర్టులను పంపిణీ చేస్తున్న గుండా శ్యాం

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కబడ్డీ జట్టుకు అనిల్ అన్న యువసైన్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం ఆవరణలో ఆదివారం కాంగ్రెస్ జిల్లాయూత్ అధ్యక్షుడు గుండాశ్యాం టీషర్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను వెలికితీసేందుకు గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకు సీఎం కప్ 2024 పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికై జిల్లాకు మంచి పేరుతేవాలని కోరారు. కార్యక్రమంలో పీఈటీ రాజేష్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో బ్లాకెంట్ల పంపిణీ



బ్లాంకెట్లను పంపిణీ చేస్తున్న సీఐ రమేష్, ఎస్సై మధుకర్

కౌటాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనికి, హేటి, తాటిపల్లి గ్రామాల్లోని నిరుపేదలకు పోలీసులు ఆదివారం బ్లాంకెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సీఐరమేష్, ఎస్సై మధూకర్ మాట్లాడుతూ గ్రామాల్లోకి ఎవరైనా అపరిచితులు వస్తే తమకు సమాచారం అందించాలన్నారు. సైబర్‌నేరగాళ్ల మాటలు నమ్మవద్దన్నారు. ఏటీఎం పిన్, ఎకౌంటు వివరాలు చెప్పవద్దని సూచించారు.

సేవాలాల్ చారిటబుల్ ట్రస్టు సభ్యుల మద్దతు

రెబ్బెన, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రెబ్బెన, ఉట్నూరు ఐటీడీఏల ఎదుట కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు సమ్మెచేస్తుండగా, ఆదివారం సేవాలాల్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు సందర్శించి మద్దతు పలికారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ఐటీడీఏలో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్టు తరుపున రూ.5వేల ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టుసభ్యులు నగేష్, గోపాల్, ప్రభాకర్, శ్రీదాస్, స్వాతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



వాసాల ప్రభాకర్

కాగజ్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్తకార్యదర్శిగా కాగజ్‌నగర్ ఎంఈవో వాసాల ప్రభాకర్‌ను ఆదివారం నియమించారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రభాకర్ మాట్లాడుతూ తనపై నమ్మకం పెట్టి కీలక పోస్టు అప్పజెప్పినందుకు రాష్ట్ర సంఘ నాయకులకు కృతజ్ఞలు తెలిపారు. ఆయనను జిల్లాగెజిటెడ్ హెడ్మాస్టర్స్ సంఘం అధ్యక్షుడు అబ్దుల్‌లతీఫ్, జిల్లాప్రధానకార్యదర్శి రాథోడ్‌సుభాష్ అభినందించారు.

క్షేత్రపర్యటనలో శిక్షణ బీట్ ఆఫీసర్లు

బెజ్జూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 36మంది అటవీబీట్ అధికారులు ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్ రాంమోహన్ ఆధ్వర్యంలో మండలంలోని అటవీప్రాంతంలో క్షేత్ర పర్యటన చేశారు. ఆదివారం మండలంలోని కుష్టపల్లి అటవీసెక్షన్ పరిధిలోని ఇందుర్‌గాం బీట్‌లోని రాముడు బీముడు టేకు చెట్లను పరిశీలించి వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. అదే విధంగా శాఖాహార జంతువుల కోసం ఏర్పాటు చేసిన గడ్డి క్షేత్రాలను పరిశీలించారు. ఇక్కడి అడవుల ప్రాముఖ్యత, జీవవైవిధ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్, బీట్ అధికారి వెంకటేశం తదితరులు ఉన్నారు.



రాముడు బీముడు టేకుచెట్ల వద్ద శిక్షణ బీట్ అధికారులతో కోర్సు డైరెక్టర్

వివాహ వేడుకల్లో పాల్గొన్న సిర్పూరు ఎమ్మెల్యే



దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తనయుడు కోవసాయినాథ్ వివాహం హైదరాబాద్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగులగూడ గ్రామానికి చెందిన డీఎడ్ విద్యార్థిని తొర్రెం వెంకటలక్ష్మి కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఆదివారం మృతిచెందిన విద్యార్థిని కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సాయం కింద రూ.20వేల నగదు, ఒక క్వింటా బియ్యాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకునేందుకు కలెక్టర్‌తో మాట్లాడతామన్నారు. ఆయనవెంట నాయకులు బషారత్‌ఖాన్, వెంకన్న, సకారాం, పుల్లూరి సతీష్, హన్మంతు, మహేష్, నరేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



విద్యార్థిని కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

గాయపడిన వ్యక్తికి పరామర్శ..

కౌటాల: మండలకేంద్రానికి చెందిన ముచ్చ శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అతన్ని, కుటుంబ సభ్యులనుపరామర్శించారు. శ్రీకాంత్ కోనేరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచితశిక్షణ తీసుకొని ప్రభుత్వ కొలువు సాధించాడు. ఇటీవలఉద్యోగానికి వెళ్లుతున్న క్రమంలో పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. మాజీ ఎమ్మెల్యే సతీమణి రమాదేవి, మాంతయ్య తదితరులున్నారు.

గుడ్డు ఉడుకుతలే..

- అమాంతం పెరిగిన ధర
- గిట్టుబాటు కాదంటున్న వంట నిర్వాహకులు

బెజ్జూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కోడిగుడ్డు ధర ఆకాశన్నంటుతోంది. ఇది పాఠశాలల్లో మధ్యాహ్న భోజన తయారీ ఏజెన్సీలకు భారంగా మారుతోంది. సోమ, బుధ, శుక్ర వారాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ఉడికించిన గుడ్డు అందించాలి. కానీ కొద్దినెలలుగా గుడ్డు ధర అమాంతం పెరగడంతో చాలా పాఠశాలల్లో వారానికి ఒకటి, రెండుసార్లు మాత్రమే వడ్డిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు పోషకాహారానికి దూరమవుతున్నారు. ఒక్కో గుడ్డుకు రూ.5ప్రభుత్వం చెల్లిస్తోంది. కానీ ప్రస్తుతమార్కెట్‌లో గుడ్డు ధర రూ.8వరకు ఉంది.

ధరలు పెంచితేనే..

ఐదు నెలలుగా గుడ్డు ధర అమాంతం పెరిగింది. గతంలో ఎప్పుడూ ఇంతగా పెరిగిన దాఖలాలు లేవు. కిందటి ఆగస్టు నెలలో రూ.5.50ఉండగా, ప్రస్తుతం రూ.8కి చేరింది. రానున్న రోజుల్లో ఇంకెంత పెరుగుతుందోనని వంట ఏజెన్సీ మహిళలు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల ప్రభుత్వం గురుకులాలు,వసతిగృహాల విద్యార్థులకు డైట్‌చార్జీలు 40 శాతంవరకు పెంచినక్రమంలో పెరిగిన నిత్యావసరాలకనుగుణంగా మధ్యాహ్న భోజన తయారీ ఏజెన్సీలకు ధరలు పెంచాలని కోరుతున్నారు.

నెలలో 12సార్లు..

మధ్యాహ్న భోజనంలో వారంలో మూడుసార్లు నెలలో 12సార్లు గుడ్డును అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వం మాత్రం గుడ్డుకు రూ.5మాత్రమే ఇవ్వడంతో ఒక్కో విద్యార్థిపై నెలకు అదనంగా రూ.24భారం పడుతోందని నిర్వాహకులు చెబుతున్నారు. ఈభారం భరించలేక కొన్నిపాఠశాలల్లో గుడ్డుకు బదులుగా రాగి జావ, ఇతర కూరగాయలను వండి వడ్డిస్తున్నారు. కొన్నిపాఠశాలల్లో ఏజెన్సీలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటూ నష్టపోయినా సరే గుడ్డును అందిస్తున్నాయి. జిల్లాలో అన్నిరకాల పాఠశాలలు 990ఉండగా, 42,350మంది విద్యార్థులు చదువుతున్నారు. 1591వంట ఏజెన్సీలున్నాయి. దీంతో ఆయా పాఠశాలలో గుడ్డు ధరలు పెరగడం వారికి శాపంగా మారింది.



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

క్రైం కార్నర్

చేపల దొంగలను పట్టుకున్న గ్రామస్థులు

బెల్లంపల్లిరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దుగ్నేపల్లి బోకే చెరువులో శనివారం అర్ధరాత్రి దొంగలు మూడు క్వింటాళ్లకు పైగా చేపలను పట్టుకుని విక్రయించారు. గ్రామానికి చెందిన కొందరు నెన్నెల మండల కేంద్రానికి చెందిన చేపలు పట్టే వారికి డబ్బులు ఇచ్చి రాత్రంతా చెరువులో చేపలు పట్టించారు. దొంగతనంగా పట్టిన చేపలను బెల్లంపల్లికి తరలించారు. చేపలు పట్టుకుపోతున్న వ్యక్తులను గమనించిన గ్రామస్థులు మాజీ సర్పంచు డోలె సురేష్‌తో కలిసి చేపలతో పారిపోతున్న భీమేష్, రావల్‌ను పట్టుకున్నారు. వారిని విచారించగా డబ్బులు ఇచ్చి చేపలు పట్టాలని చెప్పడంతో తాము చెరువులో చేపలు పట్టి అప్పగించినట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు మాజీ సర్పంచు తెలిపారు.

గంజాయి పట్టివేత

కోటపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పారుపెల్లి జాతీయ రహదారి మీదుగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఆదివారం పట్టుకున్నట్లు చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్ తెలిపారు. జాతీయ రహదారిపై పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా కొల్లూరు గ్రామానికి చెందిన ఆలం పున్నం పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నామన్నారు. తనిఖీ చేయగా అతని వద్ద 1550 గ్రాముల గంజాయి దొరికినట్లు పేర్కొన్నారు. కొల్లూరులో ఇంటి దగ్గర గంజాయి సాగు చేసి చెన్నూరులో అమ్మేందుకు తీసుకువెళ్తుండగా పట్టుకున్నామని ,దీని విలువ రూ.38 వేలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజురా గ్రామంలో ఆదివారం టాస్క్‌ఫోర్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. రాజురాలో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచినట్టు పక్కా సమాచారం మేరకు దాడులు చేయగా, బోయిరె వినోద్ ఇంట్లో మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 9క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఎస్సై వెంకటేష్, పీసీ మధు, రమేష్, సంజీవ్, దేవేందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వాంకిడి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): టోల్‌ప్లాజా సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విక్రమ్ మాలీ అనే యువకుడికి గాయాలయ్యాయి. ఆసిఫాబాద్‌కు చెందిన విక్రమ్ మాలీ వాంకిడి మండలకేంద్రంలో జనరల్‌స్టోర్ పెట్టుకున్నాడు. ఆదివారం జనరల్‌స్టోర్ నుంచి ఆసిఫాబాద్‌కు టీఎస్ 20సీ9227 నంబరుగల ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా టోల్‌ప్లాజా సమీపంలో రోడ్డుకు అడ్డంగా వస్తున్న మేకలను ఢీకొని అదుపుతప్పి కిందపడ్డాడు. నాలుగు మేకలు మృతిచెందగా విక్రమ్ మాలీకి గాయాలయ్యాయి. యువకుడిని చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై ప్రశాంత్‌ను సంప్రదించగా ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీఐ

జైపూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇందారం బస్టాండ్ వద్ద శుక్రవారం రాత్రి బైక్ ఢీకొని సుంకరి మల్లయ్య అనే రిటైర్డు కార్మికుడు మృతిచెందగా ఆదివారం ప్రమాదం జరిగిన స్థలాన్ని సీఐ వేణుచందర్ పరిశీలించారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారని కానీ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. పశువులు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. లైటింగ్‌తో పాటు స్పీడు బ్రేకర్లను వేయించాలన్నారు. సీఐ హెచ్‌కేఆర్ రోడ్‌వేస్ మేనేజర్ రామకృష్ణతో మాట్లాడారు. వారం రోజుల్లో సెంట్రల్ లైటింగ్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి లైట్లు వెలిగేలా చేయకపోతే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. సర్వీసు రోడ్డు సైడ్ రేయిల్స్ కూడా బాగు చేయాలని సూచించారు. సీఐ వెంట ఎస్‌ఐలు శ్రీధర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

గణిత ప్రతిభా పోటీలో విద్యార్థి ప్రతిభ



గణిత ప్రతిభా పోటీలో ద్వితీయ ర్యాంకు సాధించిన విద్యార్థి చరణ్

గర్మిళ్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఫోరం రామానుజన్ జయంతి సందర్భంగా ఆదివారం హైద్రాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్షలో మంచిర్యాల ఆదర్శ పాఠశాల విద్యార్థి నల్ల చరణ్ రెండో ర్యాంకు సాధించాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ ముచ్చన్న, గణిత ఉపాధ్యాయులు హరీష్, శ్రీలత అభినందించారు.

అనగాష్టమి వ్రతాల పోస్టర్ విడుదల

గర్మిళ్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల గోదావరి తీరంలోని గౌతమేశ్వర ఆలయ ప్రాంగణంలో ఈ నెల 23న 1008 మందితో సామూహిక అనగాష్టమి వ్రతాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం రాత్రి ఆలయం వద్ద అర్చకులు వేణుగోపాల్ శర్మ వ్రతాల పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వంశీకృష్ణ, రాజేంద్ర ప్రసాద్, గాయత్రి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న శ్రీసాయి జూనియర్ కాలేజ్ పూర్వ విద్యార్థులు

నస్పూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీసీసీ కార్నర్‌లోని శ్రీసాయి జూనియర్ కాలేజ్‌లో 2005-2007లో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం నర్సయ్య భవన్‌లో సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి, లెక్చరర్స్ రాజేశ్వర్ రెడ్డి, నర్సయ్య, మల్లారెడ్డి, కుమార్, సత్యనారాయణ, అశోక్, అంజనేయులు, శరత్, శ్రీనివాస్‌లతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహితుడి వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

దండేపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి గ్రామానికి చెందిన కాగిత గోపాల్ మూడేళ్ల నుంచి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998-99లో పదో తరగతి వరకు చదువుకున్న స్నేహితులు ఆదివారం రూ.15వేల నగదును గోపాల్ కుటుంబ సభ్యులకు అందించారు.

వివాహానికి ఆర్థికసాయం

దండేపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): దండేపల్లికి చెందిన అమ్మ ఫౌండేషన్ నిర్వాహకులు జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చెరుకుల పద్మ-భూమేష్ దంపతుల కూతురు రక్షిత వివాహానికి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు భానుప్రసాద్ మాట్లాడుతూ దాతల సహకారంతో సేకరించిన నగదును ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

వేధిస్తున్న కూలీల కొరత..

- చేలల్లోనే పత్తి.. ఆందోళనలో అన్నదాత
- పులి భయం..
- కిలోకు రూ.10ఇస్తామన్నా దొరకని కూలీలు



చేలల్లో మొక్కలకు ఉన్న పత్తి

బెజ్జూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో పత్తి ఏరివేత పనులు ముమ్మరంగా కొనసాగుతుండగా ప్రస్తుతం కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. మండల వ్యాప్తంగా 26వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. పత్తి ఏరివేతకు కూలీలు దొరక్కపోవడంతో కుటుంబ సభ్యులు రోజింత చొప్పున పత్తి ఏరుతున్నారు. కూలీలకు పత్తి కిలోకు రూ.10ఇస్తామన్నా రావడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు ఏం చేయాలో తోచక అయోమయంలో ఉన్నారు. ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన అన్నదాతకు కూలీల కొరత రూపంలో తిప్పలు తప్పడం లేదు. ఈ ఏడాది పత్తి ఏరివేతకు రాజస్థాన్ రాష్ట్రం నుంచి కూలీలు ఇక్కడికి వచ్చినా కూలీల కొరత మాత్రం తీరడం లేదు.

గుబులు పుట్టిస్తున్న మబ్బులు..

ఒక వైపు కూలీలు దొరకక, మరోవైపు ఆకాశం మేఘావృతమై ఉండటంతో పత్తిరైతుల్లో ఆందోళన మొదలైంది. చేలల్లో పత్తినిండి ఉండటంతో ఎప్పుడు వర్షాలు పడతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట నష్టపోయే అవకాశం ఉన్నందున రైతులు పత్తి ఏరివేతకు నానా తంటాలు పడుతున్నారు. ప్రకృతి వైపరిత్యాల కారణంగా ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక సతమతమవుతున్నారు.

మరోవైపు పులి భయం..

అసలే పత్తి ఏరివేతకు కూలీల కొరత వేదిస్తుండటంతో ఇంకోవైపు పులిభయం కారణంగా చేలల్లోకి కూలీలు వెళ్లేందుకు జంకుతున్నారు. ఇటీవల పత్తి ఏరివేతకు వెళ్లిన కూలీలపై పులి దాడి చేయడంతో ఒక మహిళ మృతిచెందడం, మరొకరు తీవ్రంగా గాయపడ్డ విషయం తెలిసిందే. దీంతో కూలీలు అటవీసమీప చేలల్లోకి పత్తి ఏరివేతకు వెళ్లేందుకు జంకుతున్నారు. దీంతో ఎటొచ్చి రైతులకు అవస్థలు తప్పడం లేదు. పులి భయాన్ని దృష్టిలో పెట్టుకొని అటవీఅధికారులు రైతులు, కూలీలను అప్రమత్తం చేస్తున్నా కూలీల్లో భయంపోవడం లేదు.

మూతబడిన ఎమ్మార్సీ కార్యాలయం

సిర్పూరు(టి), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం మూతబడింది. ఎస్ఎస్ఏలు 12రోజుల నుంచి దీక్ష చేస్తున్నారు. ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది కూడా ఈ దీక్షలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది లేక కార్యాలయం మూతబడింది. మండలంలోని ఆయాపాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజనం మహిళలు తదితరులు పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చి చేసేది లేక మరలిపోతున్నారు.

శివాలయం 51వ వార్షికోత్సవం

కౌటాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయం ఆదివారం 51వ వార్షికోత్సవాలకు ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు శంకరయ్య ఆధ్వర్యంలో ఆదివారం ధ్వజారోహణ, గ్రామ దేవతలకు పూజలు, శివపార్వతుల పల్లకిసేవలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా సోమవారం రోజున శివుని ఆరాధన, హారతి, అఖండ దీపారాధన, తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈనెల 24న ఉదయం ఆలయంలో ఉదయం ఐదు గంటల నుంచి అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

పొగమంచు కాదు.. దుమ్ము

- ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులు
- పట్టించుకోని అధికారులు



సర్‌సిల్క్ మిల్లు నుంచి ఎస్పీఎం వెళ్లే ప్రధాన రహదారిపై లేస్తున్న దుమ్ము

కాగజ్‌నగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధానరోడ్లతో పాటు ఎస్పీఎం పరిసరాల్లో నిత్యం దుమ్ము లేస్తోంది. దీంతో ద్విచక్రవాహనాలు కూడా నడపలేని పరిస్థితి నెలకొంది. పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. సర్‌సిల్క్ ప్రాంతం నుంచి ఎస్పీఎం గేటు వరకు మార్గంలోనే పోలీస్‌స్టేషన్ ఉండటంతో వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్పీఎం యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి వెంటనే రెండుపూటల ట్యాంకర్‌తో ఈమార్గంలో నీటిని చల్లాలని కాలనీ వాసులు కోరుతున్నారు. పోలీస్‌స్టేషన్ పక్కనే ఏదైనా పెద్ద వాహనం వెళితేచాలు దుమ్ము లేస్తోంది. ఈ దుమ్ము తీవ్రత ఎంతగా ఉంటోందంటే కనీసం ఎదురుగా వచ్చే వాహనాన్ని కూడా గుర్తుపట్టలేనంతంగా ఉంటోంది. ఈ ఎస్పీఎం మిల్లుకు కర్రలోడ్ తెచ్చేందుకు లారీలను గేటుద్వారా లోనికి అనుమతిస్తారు. నిత్యం వందలాది వాహనాలు ఈమార్గంలోనే వెళుతుండటంతో ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అలాగే బస్టాండునుంచి చెక్‌పోస్టువరకుకూడా దుమ్మూలేస్తోంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ఆయా మార్గాల్లో దుమ్ము లేవకుండా తగినచర్యలు తీసుకోవాలని పట్టణవాసులు డిమాండు చేస్తున్నారు.

దుమ్ము విపరీతంగా లేసోంది..
-వెంగల నగేష్, సర్‌సిల్క్ కాగజ్‌నగర్



నేను సర్‌సిల్క్‌కాలనీలో ఉంటాను. ఇక్కడి నుంచి మార్కెట్‌వెళ్లే క్రమంలో వాహనాలు వెళ్తనప్పుడు రోడ్డుపై అంతా దుమ్ము లేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనం ఏ మాత్రం కన్పించటం లేదు. అధికారులు స్పందించి ఈ మార్గంలో దుమ్ము లేవకుండా నిత్యం రెండు పూటల ట్రాక్టర్ ద్వారా నీటిని చల్లించాలి.

లారీలతో నానా ఇబ్బందులు..
-సూర్యప్రకాష్, కాగజ్‌నగర్



ఎస్పీఎంకు కర్ర తెచ్చే లారీలతో నానా ఇబ్బందులు పడుతున్నాం. సర్‌సిల్క్ నుంచి ఎస్పీఎం గేటు వరకు, బాలభారతి నుంచి ఎస్పీఎం పాత గేటు వరకు లారీలు నిత్యం లోడ్‌తో వస్తుంటాయి. ఆ సమయంలో రోడ్డుపై ఏమీ కన్పించదు. దుమ్ము విపరీ తంగా లేస్తుండడంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలి.

ఈసుగాం శివమల్లన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఆలయ పరిసరాల్లో భక్తులు



స్వామివారి దర్శనానికి బారుతు తీరిన భక్తులు

కాగజ్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం ఈసుగాం శివమల్లన్న ఆలయంలో ఆదివారం భక్తులు మల్లన్నకు ఘనంగా బోనాలు సమర్పించారు. జిల్లా కేంద్రంలోని నలుమూలల నుంచి భక్తులు వచ్చి బోనం వండి శివలింగం వద్ద పూజలు నిర్వహించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సమావేశంలో మాట్లాడుతున్న కళాకారులు

కాగజ్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న కళాకారులను ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రసాధనలో అనేక కష్టాలు పడినట్టు తెలిపారు. ప్రస్తుతం సీఎం తమను ఆదుకుంటామని ప్రకటించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాకారులు మేడి కార్తీక్, డోంగ్రి సంతోష్, గుర్రం కృష్ణ, రాంటెంకి ప్రభాకర్, సమ్మక్క, వినోద్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామికి సింగరేణితో ప్రత్యేక అనుబంధం: జీఎం



వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేస్తున్న జీఎం

శ్రీరాంపూర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తొలితరం తెలంగాణ ఉద్యమనేతగా, కేంద్ర, రాష్ట్ర మంత్రిగా గడ్డం వెంకటస్వామికి సింగరేణితో ప్రత్యేక అనుబంధం ఉందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వి సూర్యనారాయణ అన్నారు. జీఎం కార్యాలయంలో వెంకటస్వామి వర్ధంతిని నిర్వహించగా, జీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 1961నుంచి 1964వరకు ఇండియన్‌నేషనల్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్‌కు నాయకత్వం వహించారని, పెద్దపల్లి, సిద్దిపేట లోక్‌సభ సభ్యుడిగా ఏడుసార్లు ఎన్నికై రికార్డు సృష్టించారని, కేంద్రమంత్రివర్గంలో కార్మిక,జౌళి, పునరావాసశాఖ మంత్రిగా పనిచేశారని, లోక్‌సభలో పార్లమెంటరీ ఉపనాయకుడిగా, వివిధ పార్లమెంటరీ కమిటీలలో పనిచేశారని కొనియాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై 1978నుంచి 1982మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కేబినెట్‌లో కార్మిక, పౌరసరఫరాలశాఖ మంత్రిగా కూడా పనిచేశారని, సింగరేణి కార్మికుల హక్కుల కోసం పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓటుజీఎం ఎన్ సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీ సైదా, అధికారుల సంఘంఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎం(సివిల్) ఆనంద్‌కుమార్, ఫారెస్ట్‌అధికారి చంద్రమణి, సెక్యూరిటీఅధికారి జక్కారెడ్డి, సీనియర్‌పీవోకాంతారావు పాల్గొన్నారు.



రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముక సింగరేణి

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రఅభివృద్ధికి సింగరేణి వెన్నెముక లాంటిదని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. సింగరేణి ఆవిర్భావవేడుకల సందర్భంగా ఉద్యోగులు, వారికుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. బొగ్గుఉత్పత్తి ద్వారా రాష్ట్ర, దేశఇంధన అవసరాలను తీర్చడంలో సంస్థ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. సింగరేణి భవిష్యత్‌కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, శ్రమశక్తిని చాటుతూ సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని కోరారు.

ఉత్తమ అధికారుల ఎంపిక

రెబ్బెన, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):సింగరేణిలో ఉత్తమ అధికారులను ఎంపిక చేసినట్టు పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తమ అధికారుల జాబితాలో ఉన్నవారిలో నాగులవేణు(డీవైపీఎం) ఖైరిగూడ, పిశ్రావణ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోలేటి సీహెచ్‌పీ ఉన్నారన్నారు. అలాగే ఉత్తమ ఉద్యోగులుగా ఎండీ అబ్దుల్ సమద్, హెడ్ ఓవర్‌మెన్ ఖైరిగూడ, ఓపెన్‌కాస్టు, సురేష్ కోరి కన్వేయర్ ఆపరేటర్ గోలేటి సీహెచ్‌పి ఎంపికైనట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు సింగరేణి ఆవిర్భావ వేడుకలు

శ్రీరాంపూర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ వేడుకలు నేడు జరుగనున్నాయి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను శ్రీరాంపూర్ ప్రగతి మైదా నంలో అధికారులు పూర్తిచేశారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా జీఎం ఎల్‌వి సూర్యనారాయణ, సేవా అధ్యక్షురాలు మాలతి హాజరవుతారు. ఉదయం 11గంటలకు జెండావిష్కరణ, స్టాల్స్ ప్రారంభమవుతాయి. సాయంత్రం 6గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమాల్లో అతిథులకు ఆహ్వానం, జ్యోతి ప్రజ్వలన, సింగరేణి గీతం ఆలాపన, అధికారులసంఘం అధ్యక్షుడి ప్రసంగం, సేవా అధ్యక్షురాలి ప్రసంగం, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ప్రసంగం, ముఖ్య అతిథిప్రసంగం ఉంటాయి. అనంతరం ఉత్తమ ఉద్యోగులు, అధికారులకు సన్మానం, గతంలో జరిగిన ఆటలపోటీల విజేతలకు బహుమతుల ప్రదానం, సాంస్కృతి కార్యక్ర మాలుంటాయి. చివరగా వందన సమర్పణ, జాతీయ గీతాలాపనతో కార్యక్ర మాలు ముగుస్తాయి. ఆయావేడుకలను చూడడానికి వచ్చే సింగరేణి ఉద్యోగులు, వారికుటుంబ సభ్యులకు అవసరమైన వసతులను నిర్వాహకులు కల్పించారు.

వేడుకలకు ఏర్పాట్లు..

మందమర్రిటౌన్: నేడు జరిగే సింగరేణి సంస్థ 136వ ఆవిర్భావ వేడుకలకు పట్టణంలోని సింగరేణిపాఠశాల మైదానం ముస్తాబైంది. ఈ వేడుకలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేకంగా స్టేజీ ముందు వాటర్ ఫౌంటెన్‌ను ఏర్పాటు చేశారు. కార్మికుల నీడ కోసం టెంట్లు వేశారు.

సింగరేణి ప్రాముఖ్యతను తెలిపే స్టాళ్లను ఏర్పాటు చేశారు. చలికాలం కావడంతో మైదానంలో తాత్కాలిక మంటలను వేసేందుకు ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించను న్నారు. సీఎండీ బలరాం సందేశాన్ని ఏరియా జీఎం దేవేందర్ చదివి వినిపించనున్నారు. జీఎం కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం మైదానంలో వేడుకలను ప్రారంభించనున్నారు. ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఏరియా జీఎం దేవేందర్ ఆదివారం తెలిపారు.

రెబ్బెన: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాలు సోమవారం నిర్వహిస్తుండటంతో గోలేటి టౌన్‌షిప్‌లోని స్టేడియంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకస్టాళ్లను రూపొందించారు. సింగరేణి మైన్స్, ఓపెన్‌కాస్టు నమునాలను పనితీరును వివరిస్తూ ప్రత్యేక స్టాల్స్, తినుబండారాలు, క్రీడలకు సంబంధించిన అంశాలను ఏర్పాటు చేశారు.

అయ్యప్పకు ఘనంగా చక్రస్నానం



అయ్యప్ప స్వామి చక్రస్నానం నిర్వహిస్తున్న గురుస్వాములు

కాగజ్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం అయ్యప్పస్వామి చక్రస్నాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక అయ్యప్ప ఆలయంనుంచి ప్రారంభమైన పల్లకి సేవ కార్యక్రమం పలు వీధుల గుండా సాగింది. అనంతరం పెద్దవాగులో అయ్యప్పకు పూజలు నిర్వహించి చక్రస్నానం నిర్వహించారు.

అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి

- ములుగు జిల్లాకేంద్రం శివారులో ఘటన

ములుగు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా లారీడ్రైవర్ మృతి చెందినసంఘటన ములుగులో చోటుచేసు కుంది. లారీడ్రైవర్‌గా పనిచేస్తున్న ఒర్సుశ్రీనివాస్(42) తలకు తీవ్రగాయాలతో కన్నుమూశాడు. ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాలప్రకారం.. మంచిర్యాలజిల్లా చెన్నూ రుకు చెందిన శ్రీనివాస్ హనుమకొండలో భార్యాపిల్లలతో నివాసం ఉంటూ జయశం కర్ భూపాలపల్లి జిల్లా రేగొండకు చెందిన లింగారావు వద్ద లారీడ్రైవర్‌గా పనిచేస్తు న్నాడు. శనివారం సాయంత్రం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరిన అతడు ఆదివారం ఉదయం వరకు రేగొండకు చేరుకోలేదు. ఆదివారం ఉదయం ములుగు-బండారుపల్లి మధ్య మదర్సా వెనుక ఖాళీప్రదేశంలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లారు. జేబులో దొరికిన ఆధార్‌కార్డు ద్వారా ఆయన వివరాలు సేకరించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలంలో రాళ్లకుప్ప ఉండటం, మృతుడి తలకు తీవ్ర గాయాలు కావడంతో హత్య కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.

కాకా సేవలు చిరస్మరణీయం



హైదరాబాద్‌లో కాకా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రి టౌన్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి కాకా వెంకటస్వామి పదో వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నాయకులు నోముల ఉపేందర్ గౌడ్, సొత్కు సుదర్శన్‌లు కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీకి కాకా చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. నాయకులు మంద తిరుమల్, పుల్లూరి లక్ష్మణ్, గడ్డం ర జిని, నెర్వెట్ల శ్రీనివాస్, రాయబారపు కిరణ్, ఎర్ర రాజు, గుడ్ల శ్రీనివాస్, పాల్గొన్నారు. ఇందుగార్డెన్ వద్ద కాకా వర్ధంతి నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండి సదానందం, రాగిడి రాంరెడ్డిలు వెంకటస్వామి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేక్ పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పట్టణంలోని పలువురు పేదలకు అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చలికాలం నేపథ్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. ఎండి ఇబ్రహీం, తిరుపతిగౌడ్, ఎం నగేష్, పెద్ది రాజన్న, రాజయ్య రాజలింగు, కొట్టె రాజన్న పాల్గొన్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి సేవలు మరువలేనివని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య అన్నారు. ఏఎంసీ చౌరస్తాలోని కాకా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకా జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని ప్రకటించడం సంతోషకరమన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, టీపీసీసీ మెంబర్ శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గెల్లి జయరాం, కౌన్సిలర్లు నారాయణ, రాజలింగు, రవి పాల్గొన్నారు.



మందమర్రిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోటపల్లి, (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని కోటపల్లిలో నిర్వహించారు. సీనియర్ నాయకులు ఆలూరి సంపత్ ఆధ్వర్యంలో పలువురు కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేత సమ్మయ్య, రమేష్, మల్లయ్య, చింత సుధాకర్, వెంకటి, రాజన్న, గణపతి, ప్రవీణ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి కాకా వెంకటస్వామి వర్ధంతి పట్టణంలో నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సాయి అన్నపూర్ణ వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించి దుప్పట్లు పంపిణీ చేశారు. హేమంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కరుణసాగర్‌రావు, రాజమల్లగౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో వెంకటస్వామి వర్ధంతి నిర్వహించారు. కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, మల్టీ పర్పస్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతి పురస్కరించుకుని మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు. ట్యాంకు బండ్ వద్ద వెంకటస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గందె రాంచందర్, కొమురయ్య, రాజేష్, రాజలింగు, అంజి,సంపత్, పున్నం , పాల్గొన్నారు.

ఘనంగా కాకా, పీవీ రావు వర్ధంతి

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి, మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు వర్ధంతి నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గజెల్లి లక్ష్మణ్, రాంబాబు, పాత వీరస్వామి, దాసరిరామన్న, రాజయ్య పాల్గొన్నారు.



ప్రణాళికలను విడుదల చేస్తున్న సీఎండీ, ముఖ్యమంత్రి (ఫైల్)



గనిలో ఉన్న ఎల్‌హెచ్‌డీ యంత్రం



మొక్కలు నాటుతున్న సీఎండీ (ఫైల్)

సిరుల మాగాణి సింగరేణి

5వపేజీ తరువాయి

40వేలకు పడిపోయింది. బొగ్గు లక్ష్యాలు పెరుగుతున్నప్పటికీ ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్ సోర్సింగ్ ఫలితంగా కార్మికుల సంఖ్యను క్రమంగా కుదిస్తూ వస్తోంది. పర్మినెంట్ కార్మికుల స్థానంలో బొగ్గు బావుల్లో సుమారు రెండున్నర లక్షలకు పైగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులతో పనులు చేయిస్తున్నారు. కొత్త గనులు ప్రారంభించడం ద్వారా ఉద్యోగవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తద్వారా కార్మికుల సంఖ్యను పెంచుతూ గత చరిత్ర పునరావృతం కోసం పాటుపడాలని కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.

ఆటుపోట్లను ఎదుర్కొని లాభాల దిశగా

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి) : తెలంగాణాలోని ఆరు జిల్లాలో విస్తరించి ఉన్న సింగరేణి సంస్థ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని లాభాల దిశగా పయనిస్తోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోంది సింగరేణి. దేశ వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి సంస్థలో ప్రత్యేకత ఉన్న సింగరేణిలో 1980లో అనేక ఆటుపోట్లను ఎదుర్కొంది. 1989-97 మధ్య కాలంలో కంపెనీ ఆర్థిక పరిస్థితి దిగజారింది. కంపెనీ 1200కోట్ల నష్టాలలో కూరుకుపోయింది. బీఐఎఫ్‌ఆర్ పరిధి లోకి వెళ్లింది. 1989-90 నుంచి మొదలు 1993 వరకు బీఐఎఫ్ఆర్ నివేదించబడింది. కొన్ని షరతులకు లోబడి 1993-94లో రూ.17.67 కోట్లు 1994-95 రూ.24 కోట్లు కంపెనీ లాభాలను ఆర్జించింది. కాయిలా పరిశ్రమగా మారిన సందర్భంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాకా వెంకటస్వామి యాజమాన్యంతో మాట్లాడి ప్రత్యేక మానిటోరియం ఇప్పించారు. 1999- 2000లో రూ.256 కోట్లు ఇక్విటీ రూపంలో చేర్చాయి. వడ్డీ వచ్చే విధంగా లిక్విడేటింగ్ చేశాయి. 13 శాతం బాండ్లను పూచిగా పెట్టి 11.75 శాతం రుణాలను పొందడం వల్ల నాలుగు సంవత్సరాల్లో రూ.61 కోట్ల ఆదాయం సాధించింది.

విద్యుత్ సంస్థలకు బొగ్గు సరఫరా...

80 శాతంకు పైగా బొగ్గును విద్యుత్ సంస్థలకు సరఫరా చేస్తుంది. దీనిలో కేటీపీఎస్‌తోపాటు రామగుండం (బిపవర్ హౌజ్‌కు), ముద్దునూరు కేటీపీఎస్‌కు, రాయ్‌చూర్, సిమెంట్ పరిశ్రమలకు, స్పాంజ్, ఐరన్‌కు బొగ్గు సరఫరాను చేస్తుంది. అధిక ఆదాయం ఈ సంస్థల ద్వారానే వస్తుంది.

సంస్థకు ఎన్నో అవార్డులు....

సింగరేణి సంస్థకు ఇప్పటికి ఎన్నో ప్రతిష్టాత్మకమైన అవార్డులు వచ్చాయి. 2023-24లో 70మిలియన్ టన్నులు, 2024.25లో 72మిలియన్ టన్నులు నిర్ధేశించారు. 2021లో ఐఈఐ ఇండస్ట్రీ ఎక్సలెన్సీ అవార్డు, ప్రెస్టేజ్ అవార్డు, ఎనర్జీ ఎఫిషియన్సీ అవార్డు, 2018లో బెస్ట్ కంపెనీ ఆఫ్‌ద ఇయర్ అవార్డు, కోల్ ఇండియా ప్రొడక్టి విటీ అవార్డు, తదితర అవార్డులు అందుకుంది.



మందమర్రి మైదానంలో ఏర్పాటు చేసిన వేదిక

సింగరేణిలో రెస్క్యూ టీం...

కార్మికులను కాపాడేందుకు ప్రత్యేకంగా ఓ రెస్క్యూ టీంను ఏర్పాటు చేశారు. ఈ సభ్యులు ఎలాంటి రిస్కు లోనైనా గని ప్రమాదంలో కార్మికులను రక్షిస్తున్నారు. ఆయా రెస్క్యూ స్టేషన్‌లో వారికి శిక్షణ ఇస్తున్నారు. ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. గని ప్రమా దాలతో పాటు వరద ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు, ఇలా ఏ ప్రమాదాలు జరిగి నా యాజమాన్యం ఆదేశాల మేరకు వారిని కాపాడుతున్నారు. సింగరేణి రెస్క్యూ టీం పలు అవార్డులను కూడా సాధించింది. దీనిలో పని చేస్తున్న ప్రతీ ఒక్కరు ప్రాణాలకు తెగించి కార్మికులను కాపా డుతున్నారు. సింగరేణికి ప్రత్యేక సంజీవినిలా ఈ రెస్క్యూ టీం సభ్యులకు పేరుంది.



వృత్తి శిక్షణ కోర్సులు...

సింగరేణిలో సేవా సంస్థను ఏర్పాటు చేసి మహిళలకు చేయూతనందిస్తుంది. వీరికోసం వృత్తి శిక్షణ కోర్సులను ప్రవేశపెట్టి వారి కాళ్లపై నిలబడే విధంగా సహకారం అందిస్తుంది. టైలరింగ్, బ్యుటీషన్, మగ్గం వర్కులపై శిక్షణ ఇస్తుంది. రెండు దశా బ్దాలుగా సింగ రేణి సేవా సంస్థద్వారా వేలాది మంది మహిళలు శిక్షణ పొంది సొంతగా దుకాణ సముదాయలను ఏర్పాటు చేసి వారి కాళ్లపై వారు నిలబడుతున్నారు. ఆర్థిక ప్రగతిని సాధిస్తున్నారు.

చైతన్యం ఎక్కువే..

ఒకప్పుడు విప్లవోద్యమాలకు పురిటిగడ్డగా నిలిచిన నల్ల బంగారు నేల తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమాల్లో కార్మికులు ముందు వరుసలో నిలిచారు. 30 రోజుల సకల జనుల సమ్మెలో బొగ్గు పెళ్ళ బయటకు రాకుండా కలిసికట్టుగా ఉద్యమించారు.

ఉత్పత్తిలో మేటి... లాభాల్లో సాటి

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి) : సింగరేణి యేటా తన లక్ష్యాన్ని పెంచుకుంటూ ముందుకు సాగుతోంది. లాభాల పంట పండిస్తూ కార్మికులకు వాటాలు పంచుతోంది. సంస్థకు వచ్చిన లాభాల్లో కార్మికులకు పెద్ద మొత్తంలో వాటాలు ఇస్తున్న దేశంలో ఏకైక కంపెనీగా నిలుస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 67.17 మిలియన్ టన్నులు, 2023-24లో 75మిలియన్ టన్నులు సాధించగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 100మిలియన్ టన్నులు లక్ష్యంగా ముందుకు సాగుతోంది. దేశంలోని వివిధ థర్మల్ కేంద్రాలకు అవసరమైన బొగ్గును అందిస్తూ దేశానికే దిక్సూచిగా నిలుస్తోంది.

ఎస్‌టీపీపీతో వెలుగులు

జైపూర్ మండలంలో ఏర్పాటు చేసిన ఎస్‌టీపీపీ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ పవర్‌గ్రిడ్‌కు అంది స్తోంది. ఇప్పటికే పలు విభాగాల్లో 13 అవార్డులను సాధించింది. బొగ్గు మండించడం ద్వారా ఉత్పత్తి అయ్యే కార్బన్ డై యాక్సైడ్ ద్వారా కూడా విద్యుత్‌ను తయారు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసింది. అలాగే ఫైయాష్‌ను సైతం సిమెంట్, ఇటుకల తయారీ, ఇతర రంగాల్లో వినియోగించేలా చర్యలు చేపట్టింది. అను కున్న మేర అన్ని యూనిట్ నిర్మాణాలు పూర్తయితే రాబోయే రోజుల్లో 2800 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ప్రభుత్వరంగ కంపెనీగా ఎదుగనుంది. ఒడిషా లోని నైనీ బ్లాక్ ద్వారా వచ్చే బొగ్గుతో అదే ప్రాంతంలో మరో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు తగిన ఏర్పాట్లు చేశారు.

కారుణ్య నియామకాల ద్వారా...

సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. యేటా వేలాది మందికి అవకాశాలు కల్పిస్తోంది. ఇటీవల ఎక్స్‌టర్నల్ ద్వారా ఐటీఐ, బీటెక్ చదివిన అభ్యర్థులకు వివిధ స్థాయిల్లో ఉద్యోగావకాశాలు కల్పించారు.

కార్మిక సంక్షేమానికి పెద్దపీట

యాజమాన్యం కార్మిక సంక్షేమానికి ప్రత్యేక చొరవ చూపుతోంది. వారి పిల్లల ఉన్నత చదువులకు పది వేల చొప్పున మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేస్తుంది. నిరు ద్యోగుల ఉపాధి కోసం స్కిల్ డెవలప్ సెంటర్‌లను ఏర్పాటు చేసి శిక్షణ అందిస్తుంది. కాలనీల్లో రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణాలను ఏర్పాటు చేయడంతో పాటు కమ్యునిటీ హాల్‌ల నిర్మాణం చేపట్టింది. కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో పాటు కార్మికుల తల్లిదండ్రులకు కూడా ఉన్నత వైద్యానికి యాజమాన్యం చర్యలు తీసు కుంటుంది.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీవో శ్రీపతి బాపురావు

జైపూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు పేర్కొన్నారు. ఆదివారం ఇందారం, ఎల్కంటి, గంగిపెల్లి, జైపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా యాప్‌లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఇంటి పన్నులు చెల్లించాలని కిరాణ షాపు యజమా నులకు, ప్రజలకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ర్యాలీ వాగు ప్రాజెక్టు కాలువకు గండి

హాజీపూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముల్కల్ల ర్యాలీ వాగు ప్రాజెక్టు నుంచి సాగు నీరందించే ప్రధాన కాలువకు గండి పడింది. రైతులు యాసంగి పనులు మొదలు పెట్టిన నేపథ్యంలో కాలువకు గండి పడడంతో నీరు పొలాలకు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. గండి పడ్డ కాలువకు అడ్డంగా ఇసుక బస్తాలను వేసినా ప్రయోజనం ఉండడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువకు మరమ్మతు చేసి నీరందించాలని రైతులు కోరుతున్నారు.



గండిపడిన చోట వేసిన ఇసుక బస్తాలు



కుండీలో ఏర్పాటు చేసిన మొక్కలు



ఇంటి ఆవరణలో విరబూసిన పూల మొక్కలు

మొక్కలతో ఆహ్లాదం

- ఇంట్లో 300ల రకాలకుపైగా మొక్కలు
- ఇంటిని నర్సరీగా మార్చిన సివిల్ సూపర్‌వైజర్



మొక్కలకు నీరు పడుతున్న రాంవెంకటేశ్వర్లు దంపతులు

మందమర్రిటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కేకే 1 డిస్పెన్సరీ 1వ జోన్‌లో నివాసం ఉంటున్న సివిల్ సూపర్‌వైజర్ రాంవెంకటేశ్వర్లు నివాసం మొక్కలతో కళకళలాడుతుంది. రాంవెంకటేశ్వర్లు దంపతులకు మొక్కలు పెంచడమంటే ఆసక్తి. సింగరేణి సివిల్ డిపార్టుమెంట్‌లో సివిల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఎక్కడకు వెళ్లినా నచ్చిన మొక్కలను కొనుగోలుచేసి ఇంట్లో పెంచుతున్నాడు. ఏళ్ళగా పెంచుతున్న మొక్క లు వృక్షాలుగా మారి ఇల్లు పచ్చదనంతో నిండుకుంది. రోజు దంపతులు ఇద్దరు మొక్క లకు నీరు పట్టడంతో పాటు వాటి పెరుగు దలకు పలు చర్యలు చేపడుతున్నారు. మొక్కల పెంపకానికి రాంవెంకటేశ్వర్లు చేస్తున్న కృషికి ఆయనకు పలు అవార్డులు వచ్చాయి. ఆయన నివాసంలో 300లకు పైగా వివిధ రకాల మొక్కలు ఉన్నాయి. ఆయన ఇంటిపేరు రాంవెంకటేశ్వర్లు కాగా మొక్కలను పెంచుతుండడం, ఇల్లు వనాన్ని తలపిస్తుండడంతో ఆయనను వనం వెంకటేశ్వర్లు అని పిలుస్తుంటారు. ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలాన్ని మొత్తం మొక్కలతో నింపేశారు.

మొక్కలు పెంచాలి - రాంవెంకటేశ్వర్లు

ప్రతీ ఒక్కరు వారి నివాసాల్లో మొక్కలను పెంచాలి. దీంతో ఆ గృహం ఆహ్లాదంగా ఉంటా యి. మానవ మనుగడకు మొక్కలు ఆధా రమని తెలుసుకోవాలి. నేను నాటిన మొక్కలు ఇప్పుడు చెట్లుగా మారి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. 300లకు పైగా మొక్కలను పెంచు తున్నాను మా ఇల్లు పచ్చదనానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

ఘనంగా మారెమ్మ జాతర



అమ్మవార్లకు పూజల్లో పాల్గొన్న భక్తులు

కోటపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూపాక గ్రామంలో ఆదివారం మారెమ్మ, లక్ష్మీదేవర జాతరను భక్తులు ఘనంగా నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగిన ఈ జాతరలో చివరి రోజు అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి బోనాలను సమర్పించారు. మాజీ సర్పంచు సతీష్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు రైలు సౌకర్యం కల్పించాలి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్తున్న అయ్యప్ప స్వాముల భక్తులకు సౌకర్యార్థం సిర్పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల మీదుగా శబరిమలకు ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించాలని ఆదివారం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రావు, సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ప్రత్యేకంగా రైలు లేకపోవడంతో అయ్యప్ప భక్తులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

మార్కండేయస్వామి ఆలయ వార్షికోత్సవం



మార్కండేయస్వామి ఆలయంలో నాగపడిగ అలంకరిస్తున్న పూజారులు, భక్తులు

దండేపల్లి, డిసెంబరు 22: దండేపల్లి పద్మశాలి భవనంలో భక్త మార్కండేయస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. మార్కండేయస్వామికి మహా హోమం, పూర్ణాహుతి, గణపతి, గౌరీపూజలను పురోహితులు బండి మల్లేష్, అడ్డగట్ల శంకరయ్య, భీమండి చెందిన పురోహితులు జంజిరాల నంబయ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. దండేపల్లికి చెందిన ఎనగందుల దేవేందర్, శారద దంపతులు నాగపడిగను అందజేయగా మార్కండేయస్వామికి అలంకరించారు. కలమడుగుకు చెందిన జోన్నల శంకరయ్య బృందం భగవద్గీత, హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. కరీంనగర్ చెందిన చిలకమారి శంకర్-లక్ష్మి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పద్మశాలి సంఘం నాయకులు, పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

గర్మిళ్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని శ్రీశ్రీనగర్‌లో ముక్కిడి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామగుండం రాముశర్మ కార్య క్రమాన్ని నిర్వహించారు. అనం తరం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుధమల్ల గాయత్రి-హరికృష్ణ, ప్రజలు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

సిరుల మాగాణి సింగరేణి



సింగరేణి దేశ పారిశ్రామిక రంగానికి ఇంధన వనరు.. తెలంగాణ రాష్ట్రానికి సిరుల మాగాణి... సింగరేణి... వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మరెన్నో కుటుంబాలకు ఉపాధి కల్పించే కల్పవల్లి. బొగ్గు ఉత్పత్తితోపాటు విద్యుత్ ఉత్పత్తి చేసి రాష్ట్ర రైతాంగానికి, పారిశ్రామిక రంగానికి దన్నుగా నిలుస్తోంది... సోమవారం సింగరేణి ఆవిర్భావ వేడుకలను జరుపుకునేందుకు కార్మికలోకం సిద్ధమైంది...

- నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం
- నూతన ఆవిష్కరణలతో విరాజిల్లుతున్న సంస్థ
- యేటా విస్తరిస్తున్న సంస్థ కార్యకలాపాలు
- ఇతర రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తికి సన్నాహాలు

మంచిర్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తిలో రారాజు సింగరేణి. యేటేటా తన కార్యకలాపాలను విస్తరిస్తున్న సింగరేణి నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగుతోంది. 1870లో బొగ్గు అన్వేషణతో ప్రారంభమై, తరగని సంపదను వెలికితీస్తూ భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతోంది. 1989లో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించింది. మొదటది హైదరాబాద్ దక్కన్ కంపెనీ లిమిటెడ్‌గా ప్రారంభమై, 1920 డిసెంబరు 23న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌గా ఆవిర్భవించింది. మొట్టమొదట ప్రభుత్వరంగ సంస్థగా పేరుగాంచింది. తెలంగాణలోని ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి గోదావరి పరివాహక ప్రాంతంలో తరగని బొగ్గు నిక్షేపాలను కలిగి ఉంది. 135 వసంతాలు పూర్తి చేసుకొని 136 వసంతంలోకి నేడు అడుగుతోంది.

నూతన ఆవిష్కరణలతో...

135 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రగల సింగరేణి సంస్థ ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగుతోంది. బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న సంస్థ కాలక్రమేణ సోలార్ విద్యుత్ ఉత్పత్తి రంగంలో అడుగిడింది. పర్యావరణ హిత, వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా సింగరేణి వ్యాప్తంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తికి నాంది పలికింది. అంతేగాక థర్మల్, సోలార్, పంప్డ్ స్టోరేజీ, జియో థర్మల్ ప్రాజెక్టుల ఏర్పాటు, గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియం నైట్రేట్ తయారీ, కార్బన్ డై యాక్సైడ్ నుంచి మిథనాల్ ఉత్పత్తికి చర్యలు చేపడుతోంది. కంపెనీ సుస్థిర అభివృద్ధికి నూతన ప్రాజెక్టుల సాధనకు యాజమాన్యం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ ఏరియాలలో నూతన గనుల ఏర్పాటుకు అనుమతులు సాధించింది.

కార్మికులకు తొలిసారిగా అత్యధిక లాభాల వాటా....

సింగరేణి చరిత్రలోనే ఈ ఏడాది కార్మికులకు అత్యధిక లాభాలా వాటా పంపిణీ చేసింది. సంస్థ ఆర్జించిన లాభాల్లో రూ.796 కోట్లను కార్మికులకు వాటాగా పంపిణీ చేసింది. అలాగే కంపెనీలో పని చేస్తున్న పొరుగు సేవల సిబ్బందిని గుర్తిస్తూ తొలిసారిగా వారికి కూడా లాభాల వాటా కింద రూ.5వేల చొప్పున చెల్లించేందుకు నిర్ణయం తీసుకోవడం ద్వారా సింగరేణి వ్యాప్తంగా 30 వేల మంది కుటుంబాల్లో ఆనందాన్ని నింపింది. దీపావళి బోనస్‌లోనూ గతేడాదితో పోల్చితే రూ.50 కోట్లు అదనంగా కార్మికులకు చెల్లించింది. దీపావళి బోనస్ కింద ఒక్కో కార్మికుని రూ.93,750 చెల్లించింది. మొత్తంగా రూ. 358 కోట్లను దీపావళి బోనస్ కింద కార్మికుల ఖతాల్లో జమ చేసింది.

40వేల మంది కార్మికులతో...

గతంలో లక్షా 16 వేల కార్మికులతో కళకళలాడిన సింగరేణి సంస్థ ప్రస్తుతం కార్మికులను తగ్గించే పనిలో నిమగ్నమైంది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న సింగరేణి కార్మికుల సంఖ్య ప్రస్తుతం..

మిగతా 7లో

రూ. 37,50 కోట్ల టర్నోవర్...

సింగరేణి చరిత్రలోనే అత్యధిక బొగ్గు ఉత్పత్తి, రవాణా, టర్నోవర్ సాధించి అగ్రగామిగా నిలిచింది. సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్ధేశిత 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించి 70.02 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించింది. ఐదేళ్లలో నిర్ధేశించిన లక్ష్యాలను సాధించడం ఇదే తొలిసారి కావడం విశేషం. అలాగే బొగ్గు రవాణాలో అత్యధికంగా 69.86 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సాధించి రికార్డు సృష్టించింది. సంస్థ చరిత్రలోనే అత్యధికంగా 37,500 కోట్ల టర్నోవర్‌ను సాధించడం ద్వారా రూ. 4701 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

నైనీ బొగ్గు ఉత్పత్తికి శ్రీకారం..

తెలంగాణ మాదిరిగా ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణి బొగ్గు ఉత్పత్తికి శ్రీకారం చుడుతోంది. ఒడిశాలోని నైనీ ప్రాంతంలో ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలనే లక్ష్యంతో యాజమాన్యం ముందడుగు వేస్తోంది. నైనీ బొగ్గు బ్లాక్‌లో ఉత్పత్తికి జూలై 12న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.... ఒడిశా ముఖ్యమంత్రితో సమావేశమై బొగ్గు ఉత్పత్తిపై చర్చించగా సానుకూల స్పందన లభించింది. నైనీ బ్లాక్‌కు ఇప్పటికే అవసరమైన అనుమతులు, భూకేటాయింపు ప్రక్రియ పూర్తికాగా త్వరలో ఉత్పత్తి ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



మందమర్రి మైదానంలో ఏర్పాట్లు

వేధిస్తున్న కూలీల కొరత..

- చేలల్లోనే పత్తి.. ఆందోళనలో అన్నదాత
- పులి భయం..
- కిలోకు రూ.10ఇస్తామన్నా దొరకని కూలీలు

6



ఏరడానికి సిద్ధంగా ఉన్న పత్తి చేను

మొక్కలతో ఆహ్లాదం

- ఇంట్లో 300ల రకాలకుపైగా మొక్కలు
- ఇంటిని నర్సరీగా మార్చిన సివిల్ సూపర్‌వైజర్

7



రాంవెంకటేశ్వర్లు ఇంటి ఆవరణలోని మొక్కలు

పోలీసులు క్రీడల్లో రాణించాలి



గెలుపొందిన జట్టుకు బహుమతి అందజేస్తున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసులు క్రీడల్లో రాణించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. ఆదివారం ఎంసీ క్రీడా మైదానంలో సబ్ డివిజన్ స్థాయి పోలీసుల క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ రోజు పోలీసులు విధి నిర్వహణలో భాగంగా ఒత్తిడికి గురవుతారని, క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక ధారుడ్యం పెరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరికి క్రీడలు, వ్యాయామం నిత్య జీవితంలో భాగంగా ఉండాలన్నారు. తాండూర్ జట్టు గెలుపొందగా బహుమతులు అందజేశారు. సీఐలు దేవయ్య, అఫ్జలొద్దీన్, కుమారస్వామి, శశిధర్‌రెడ్డి, పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

గర్మిళ్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ పట్టణంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్)రాష్ట్ర ఆరవ మహాసభల పోస్టర్లను ఆదివారం మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈ సభలకు ఉపాధ్యాయులు, సంఘం నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై చర్చిస్తామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, కన్వీనర్ తిరుపతి, సభ్యులు అబ్దుల్ వాహిద్, పోచన్న, శ్రీధర్, శంకరయ్య, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె



కలెక్టరేట్ ఎదుట శిబిరంలో కూర్చున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నస్పూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆదివారం 13వ రోజు చేరింది. కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్సీ అభ్యర్థి కృష్ణారావు, గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్, రాష్ట్ర కార్యదర్శి చుంచు శంకర్ వర్మ లు సందర్శించి మద్దతు తెలిపారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

చెన్నూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పద్మనగర్‌లో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా కమిటీ సభ్యురాలు సామల ఉమారాణి మాట్లాడుతూ అమిత్‌షా పదేపదే అంబేద్కర్ పేరును ప్రస్తావిస్తూ అవమానించారన్నారు. కరీంబీ, యామిని, మౌనిక పాల్గొన్నారు.

రైల్వే పనుల్లో భాగంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బెల్లంపల్లిరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలో రైల్వే 3వ లైన్ పనుల్లో భాగంగా 33కేవీ కన్నెపల్లి ఫీడర్ ఓవర్ హెడ్‌లైన్స్‌ను అండర్ గ్రౌండ్ లైన్స్‌గా మారుస్తున్నందున సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంత రాయం ఉంటుందని బెల్లంపల్లి డివిజనల్ ఇంజనీర్ రాజన్న, రూరల్ డివిజనల్ అసిస్టెంట్ ఇంజనీర్ రవికుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. భీమిని, జన్కాపూర్, కన్నెపల్లి, నాయకునిపేట, నెన్నెల, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ ఉండదని తెలిపారు.

అంబేద్కర్ వర్శిటీ పాత విద్యార్థులు ఫీజు చెల్లింపునకు అవకాశం

బెల్లంపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో 2015, 2016 లేదా అంతకుముందు అడ్మిషన్ తీసుకున్న, పరీక్షలో ఫెయిల్ అయిన పూర్వ నాన్ సెమిస్టర్ విద్యార్థులు అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజును ఈ నెల 30లోగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్, కోఆర్డినేటర్ ఏకాంబరంలు ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 500 అపరాధ రుసుంతో జనవరి 4 వరకు చెల్లించవచ్చన్నారు. వివరాలకు 9959269975, 9640279766లో సంప్రదించాలన్నారు.

టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు



సభ్యత్వం అందజేస్తున్న టీఎన్‌జీవో నాయకులు

గర్మిళ్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని టీఎన్‌జీవో భవన్‌లో రెవెన్యూ శాఖలో వీఆర్‌ఏలుగా పనిచేస్తూ వివిధ శాఖల్లో రికార్డు అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్‌లుగా ప్రమోషన్‌లు పొందిన సుమారు వంద మంది ఉద్యోగులకు టీఎన్‌జీవో అధ్యక్షుడు గడియారం శ్రీహరి టీఎన్‌జీవో సభ్యత్వం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రమోషన్‌లు రావడానికి టీఎన్‌జీవో సంఘం ఎంతో కృషి చేసిందన్నారు. కార్యదర్శి రామ్మోహన్, కార్యదర్శి మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు బాపూరావు, సతీష్‌కుమార్, రామ్‌కుమార్, తిరుపతి, బలంజయ్య, సునీత, ప్రభు, శ్రావణ్‌కుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో మండల విద్యార్థుల ప్రతిభ

వేమనపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఈ నెల 16 నుంచి 21 వరకు జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల్లో వేమనపల్లి మండల విద్యార్థులు బహుమతులు సాధించారని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు దాసరి మల్లేష్‌లు ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ 29 మంది క్రీడాకారులు పతకాలు సాధించి జిల్లాలోనే మండలాన్ని ముందు నిలిపారన్నారు. క్రీడాకారులను మాజీ జెడ్పీటీసీ రుద్రభట్ల సంతోష్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, తహసీల్దార్ రమేష్, ఎంఈవో శ్రీధర్‌రెడ్డి, సీఐ సుధాకర్, ఎస్ఐ శ్యామ్ పటేల్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అభినందించారు.

భీమారం చేరుకున్న ప్రజారగ్ జోల్ యాత్ర

భీమారం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, రాజ్యాధికారం లక్ష్యంతో కొనసాగుతున్న ప్రజారగ్ జోల్ యాత్ర ఆదివారం భీమారం చేరుకుంది. సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్, సెంట్రల్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు గుగులోత్ మల్లేష్ నాయక్ అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. వారు మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా గిరిజనులపై జరుగుతున్న భౌతిక దాడులను అరికట్టాలన్నారు. ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ యాత్ర ఈ నెల 26 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. నాయకులు పంతుల, రాజ్‌కుమార్ నాయక్, సుధాకర్‌నాయక్, రఘురాం రాథోడ్, రేఖ్యానాయక్, దేవేందర్‌నాయక్, మహేందర్, రవిరాథోడ్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు. అనంతరం సేవాలాల్‌సేన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భుక్య మోతి లాల్, గౌరవాధ్యక్షుడు హరిలాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా మహాన్ లాల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ద్రసునాయక్, ఉపాధ్యక్షులుగా శంకర్‌నాయక్‌లను ఎన్నుకున్నారు.



ప్రజారగ్ జోల్‌యాత్ర నిర్వహిస్తున్న సేవాలాల్ సేన నాయకులు

ఓపెన్ స్కూల్ తరగతులను వినియోగించుకోవాలి

దండేపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అనివార్య కారణాలతో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ విధానం ఒక వరంలాంటిందని తెలుగు పాఠ్య పుస్తకం రచయిత కోండు జనార్దన్, ఓపెన్ స్కూల్ సహాయ కోఆర్డినేటర్ సంఘర్ష్ రాజేశ్వర్‌రావులు అన్నారు. దండేపల్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం వారు మాట్లాడుతూ ఓపెన్ స్కూల్‌లో చేరిన అభ్యాసకులు సెలవు రోజుల్లో నిర్వహించే తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇవి రెగ్యులర్ పది, ఇంటర్‌లతో సమానమన్నారు. ఓపెన్ స్కూల్‌లో చదివిన వారు కూడా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందవచ్చునన్నారు. ఏప్రిల్‌లో జరిగే పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించే విధంగా చదవాలన్నారు. ఉపాధ్యాయులు గుర్రం రామ్మోహన్, కోండు రామన్న అభ్యాసకులు పాల్గొన్నారు.



ఓపెన్ స్కూల్ తరగతులలో మాట్లాడుతున్న కొండు జనార్దన్

జవాన్ కుటుంబానికి అండగా



కోర్విచెల్మలో జవాన్ కుటుంబానికి ఆర్థికసాయం

దండేపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం కోర్విచెల్మ(రాజంపేట) గ్రామానికి చెందిన ముద్దసాని మహేష్ అనే సీఐ ఎస్ఎఫ్ జవాన్ మహారాష్ట్ర నాసిక్ ఐఎస్‌పీ యూనిట్‌లో విధులు నిర్వహిస్తూ ఈనెల10న గుండె పోటుతో మృతి చెందాడు. సీఐఎస్ఎఫ్ జవాన్ మహేష్‌కు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న తోటి జవాన్లు తలాకొంత జమచేసి రూ.1లక్ష 14వేలు అందజేశారు. మహేష్ 2014నుంచి సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా సేవలు అందిస్తున్నారు. సీఐఎస్ ఎఫ్ కానిస్టేబుల్ పి.రాజేష్, డి.హరీష్, పి.శ్రీనివాస్ చేతుల మీదుగా దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో జవాన్ కుటుంబానికి ఆర్థికసాయం అందించారు.